## నాలుగు దేశాలను వణికిస్తున్న 'వైట్ లంగ్'

న్యూఢిల్లీ : అమెరికాలోని ఓహియోలో చిన్నారులు న్యుమోనియా వ్యాధి బారిన పడుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. బ్యాక్టీరియల్ న్యుమోనియాకు సంబంధించిన ఈ కొత్త రకం ఇన్‌ఫెక్షన్ చైనా, డెన్మార్క్, అమెరికా, నెదర్లాండ్స్‌ను వణికిస్తున్నది. 3–8 ఏండ్ల మధ్య వయసు చిన్నారులకు ఈ వ్యాధి సోకుతున్నది. అయితే ఈ వ్యాధికి చైనాకు సంబంధం లేదని నిపుణులు చెప్పారు. బాధితుల ఊపిరితిత్తులను స్కాన్ చేసినపుడు తెలుపు రంగు మచ్చలు కనిపిస్తుండటంతో దీనిని వైట్ లంగ్ సిండ్రోమ్ అని పిలుస్తున్నారు. దగ్గు, తుమ్ములు, సంభాషణలు, ఊపిరి తీసుకుని, వదిలేటపుడు బయటకు వచ్చే తుంపర్ల ద్వారా ఈ వ్యాధి సోకుతున్నట్లు తెలుస్తున్నది. బాధితులు జ్వరం, దగ్గు, ఛాతీలో నొప్పి, అలసట వంటివాటితో బాధపడుతూ ఉంటారు. ఓహియోలోని అధికారులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో, ఈ బ్యాక్టీరియల్ న్యుమోనియా బాధితుల్లో చాలా మందికి యాంటీ బయాటిక్స్ ఇవ్వడం వల్ల నయమైనట్లు తెలిపారు. చాలా మంది దవాఖానలో చేరాల్సిన అవసరం లేకుండానే కోలుకున్నట్లు చెప్పారు.



## ఈసారి చలి తక్కువే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: ఈసారి శీతాకాలంలో చలి తీవ్రత కాస్త తక్కువగానే ఉండే అవకాశం ఉన్నదని బారత వాతావరణ విభాగం(ఐఎండీ) అంచనా వేసింది. ఈ ఏడాది డిసెంబర్ నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు మధ్య శీతాకాలం సీజన్‌లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే కొంచెం ఎక్కువగా ఉంటాయని శుక్రవారం పేర్కొన్నది. దేశంలోని ఉత్తర, వాయువ్య, మధ్య, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో చలి గాలుల తీవ్రత కూడా సాధారణం కంటే తక్కువగా ఉంటుందని అంచనా వేసింది. శీతాకాలం వాతావరణంపై ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మొహపాత్రా మీడియాతో మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల కారణంగా దేశంలోని మధ్య, వాయువ్య రీజియన్‌లోని కొన్ని రీజియన్లు మినహా దాదాపు అన్ని ప్రాంతాల్లో సాధారణ కనిష్ఠం, గరిష్ఠం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అన్నారు. కాగా, గత కొన్ని నెలలుగా దాదాపు దేశమంతా సాధారణ కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈసారి నైరుతి రుతు పవనాలపై ఎల్‌నినో ప్రభావం పడింది. పలు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి.



## ఏఐ సాయంతో వైన్ రుచి తెలుసుకోవచ్చు!

న్యూఢిల్లీ : వైన్‌ను రుచి చూసి ఎలా ఉందో చెప్పడం చాలా ఆకర్షణీయమైన వృత్తి. ఇకపై ఈ రంగంలోకి కృత్రిమ మేధ(ఏఐ) ప్రవేశించబోతోంది. దీంతో వ్యక్తిగత ఇష్టాలకు అనుగుణంగా రుచికరమైన వైన్‌ను ఆస్వాదించడం సాధ్యమవుతుంది. టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ డెన్మార్క్, ది యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హాగన్, కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు ఈ విప్లవాత్మక విజయాన్ని సాధించినట్లు తెలిపారు. వైన్ రుచిని కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా గుర్తించడంలో సఫలమైనట్లు చెప్పారు. వ్యక్తిగతంగా ఇష్టపడే వైన్‌ను కచ్చితంగా చెప్పగలిగే ఆల్గోరిథమ్‌ను ఫీడ్ చేయగలిగినట్లు తెలిపారు. మానవుల అనుభూతిని అర్థం చేసుకుని, ఉపయోగించుకోవడాన్ని యంత్రాలకు నేర్పడం వల్ల మెరుగైన ఆల్గోరిథమ్స్‌ను రూపొందించడం సాధ్యమైందని చెప్పారు. బీర్, కాఫీల రుచిని కూడా ఇదే విధంగా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా, కృత్రిమమేధ వివిధ రంగాల్లో చూపుతున్న ప్రభావం సాంకేతిక విప్లవాన్ని మరో దశకు తీసుకెళ్తుందని నిపుణులు చెబుతున్నారు.





## మహిళలపై లైంగిక దాడి కేసు పెట్టొచ్చా?

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: సాధారణంగా లైంగిక దాడి కేసుల్లో మహిళలే బాధితులుగా ఉంటారు. అయితే ఒక మహిళపై రేప్ కేసు నమోదు చేయవచ్చా? ఈ అంశాన్ని పరిశీలించడానికి అంగీకరించిన సుప్రీం కోర్టు దీనిపై విచారణ జరుపుతామని తెలిపింది. ఈ కేసుకు సంబంధించి ముందస్తు బెయిల్‌కు 61 ఏండ్ల మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించి, దీనిపై మీ ప్రతిస్పందన తెలియజేయాలంటూ జస్టిస్‌లు హృషికేశ్ రాయ్, సంజయ్ కరోల్ పంజాబ్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆ మహిళకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ, కేసు విచారణకు సహకరించాలని పేర్కొన్నారు. కేసు వివరాలు పరిశీలిస్తే.. పిటిషనర్ పెద్దకొడుకు అమెరికాలో నివసిస్తున్నాడు. అతను ఒక మహిళలను వర్చువల్‌గా వివాహం చేసుకున్నాడు. అతనెప్పుడూ భారత్‌కు రాలేదు. ఆ మహిళ, అత్తగారితో కలిసి నివసిస్తున్నది. కొద్ది రోజుల క్రితం పోర్చుగల్ నుంచి వచ్చిన ఆమె చిన్న కొడుకు లైంగిక దాడి చేశాడని, దానికి తన అత్త కూడా సహకరించారని ఆరోపిస్తూ కేసు దాఖలు చేసింది.



## విశ్రాంత జడ్జీల గుప్పిట్లో ఆర్బిట్రల్ వ్యవస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: విశ్రాంత న్యాయమూర్తులపై ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ మధ్యవర్తిత్వ వ్యవస్థను రిటైర్డ్ జడ్జీలు బిగించిన పిడికిల మధ్య ఉంచారని విచారం వ్యక్తం చేశారు. ఇతర అర్హత కలిగిన వ్యక్తులకు అవకాశం నిరాకరించడంతో ఇది ఓల్డ్ బాయ్స్ క్లబ్‌లా ఉందని చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఇలా మధ్యవర్తిత్వ వ్యవస్థను విశ్రాంత న్యాయమూర్తులు గుప్పిట్లో పెట్టుకోవడం ప్రపంచంలోని ఏ దేశంలోనే లేదని, ఇది మనదేశంలోనే అధికమని అన్నారు. ఇంటర్నేషనల్ కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ మధ్యవర్తిత్వ ప్రక్రియ న్యాయపరమైన అడ్డంకుల నుంచి ఇబ్బంది పడకుండా ఒక యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా భారత దేశంలోని మధ్యవర్తిత్వ వ్యవస్థపై దేశంలో న్యాయవ్యవస్థ రూపురేఖలను మార్చివేస్తున్న చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ధైర్యమైన వ్యాఖ్యలను ఉపరాష్ట్రపతి ప్రశంసించారు.

# చిన్న పార్టీలు.. రెబెల్సే కీలకం!

- నేడు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు
- ప్రభుత్వ ఏర్పాటు కోసం చిన్న పార్టీలతో బీజేపీ, కాంగ్రెస్ నేతల మంతనాలు
- అధికారం చేజిక్కించుకోవడంపై పార్టీల ధీమా
- హోరాహోరీ పోరు తప్పదని విశ్లేషకుల అంచనా



మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని పాత సెంట్రల్ జైలులో కౌంటింగ్ ఏర్పాట్లు

న్యూఢిల్లీ, డిసెంబర్ 2: నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడు వెలువడనున్నాయి. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లలో ఎన్నికల కౌంటింగ్ ఆదివారం ఉదయం 8 గంటలకు మొదలవుతుందని, తొలుత పోస్టల్ బ్యాలెట్స్ తెరుస్తామని ఆయా రాష్ట్రాల ఎన్నికల ముఖ్య అధికారులు శనివారం మీడియాకు తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం అయినట్టు ప్రకటించారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారు అవుతాయని, వాటి కంటే ఓటరు ఇచ్చిన తీర్పే కీలకమని మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో బీజేపీ, కాంగ్రెస్ ముఖ్య నేతలు ప్రకటించారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ, రాజస్థాన్‌లో కాంగ్రెస్..అధికారాన్ని నిలబెట్టుకునేందుకు పోరాడుతున్నాయి. కొన్ని ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వాటికి అనుకూలంగా ఉన్నప్పటికీ, విజయంపై స్పష్టత లేదు. దీంతో తమ తమ పార్టీల్లోని రెబెల్స్, స్వతంత్రులు, చిన్న చిన్న పార్టీలతో బీజేపీ, కాంగ్రెస్ ముఖ్య నేతలు రహస్య మంతనాలు జరుపుతున్నారు. రాజస్థాన్‌లో బీఎస్పీ, భారతీయ ట్రైబల్ పార్టీ, భారత ఆదివాసీ పార్టీ..వంటి చిన్న పార్టీలతో ఒక దఫా ఇప్పటికే మాట్లాడారు.

**మధ్యప్రదేశ్‌లో బీజేపీకి కష్టమే!**

ఇక్కడ మొత్తం 230 అసెంబ్లీ స్థానాలకు ఈసారి రికార్డ్ స్థాయిలో 77.82 శాతం ఓటింగ్ నమోదైంది. ఈసారి భారీ మెజారిటీతో గెలుస్తామని ఆ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ కమల్‌నాథ్ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను విశ్వసించటం లేదన్నారు. తామే ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తామని సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ శనివారం మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

**రాజస్థాన్‌లో మెజార్టీ మార్క్ దాటితే చాలు..**

రాజస్థాన్‌లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ మధ్య గట్టి పోటీ నెలకొన్నది. మొత్తం అసెంబ్లీ స్థానాలు 200 కాగా, 199 స్థానాలకు నవంబర్ 25న పోలింగ్ జరిగింది. ఇక్కడ రెండు పార్టీలకు చెందిన రెబెల్స్ దాదాపు 40 మంది ఎన్నికల బరిలో నిలబడ్డారు. ఈ స్థానాల్లో ఆయా పార్టీల ఫలితాలు కచ్చితంగా తారుమారు అవుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెజార్టీ మార్క్ (100)కు దగ్గరగా వచ్చి ఆగిపోతే ఎట్లా? అని కాంగ్రెస్, బీజేపీలు రాజకీయ వ్యూహాలకు తెరలేపాయి. రెబెల్స్, స్వతంత్రులు, చిన్న పార్టీలతో ముందస్తు చర్చలు మొదలుపెట్టాయి.

**ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ నిలిచేనా!**

ప్రధాని మోదీ పాపులారిటీ నమ్ముకున్న బీజేపీకి ఈసారి నిరాశే ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తున్నది. సీఎం భూపేశ్ బఘేల్ నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్‌కు స్వల్ప మెజార్టీ దక్కుతుందని మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. బీఎస్పీ, జనతా కాంగ్రెస్, జీజీపీ, హెచ్‌ఆర్‌పీ, వామపక్షాలు..పొందే ఓట్లు ఫలితాల్ని తారుమారు చేసే అవకాశముంది. 2018లో కాంగ్రెస్ 68, బీజేపీ–15 స్థానాలు గెలుచుకున్నాయి. కాంగ్రెస్ అవినీతి పాలన, ఉద్యోగ నియామకాల్లో అక్రమాలు, మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణం..ఎన్నికల్లో చర్చనీయాంశమయ్యాయి.

**ఇండియా కూటమిపై ప్రభావం**

నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల ప్రభావం 'విపక్ష ఇండియా' కూటమిపై పెద్ద ఎత్తున ఉండబోతున్నది. కూటమిలో అతిపెద్ద పార్టీగా వున్న కాంగ్రెస్ గెలుపు విపక్ష కూటమిలో అనూహ్య మార్పులకు దారితీస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లలో సీట్ల సర్దుబాటు పేరుతో కాంగ్రెస్ వ్యవహరించిన తీరు టీఎంసీ, ఆప్, సమాజ్‌వాదీలను షాక్‌కు గురిచేసింది. చివరి నిమిషం వరకు తమను వేచి చూసేలా చేసి..చివరికి తమను దెబ్బ తీసిందని కాంగ్రెస్ తీరుపై సమాజ్‌వాదీ, ఆప్ నేతలు మండిపడ్డారు.

## కేంద్ర దర్యాప్తు సంస్థ పేరుతో నన్ను బెదిరించారు

### తమిళనాడు స్పీకర్ సంచలన వ్యాఖ్యలు

చెన్నై, డిసెంబర్ 2: తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం అప్పావు శనివారం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ కేంద్ర దర్యాప్తు సంస్థతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని చెబుతూ ఓ వ్యక్తి తనను మూడు నెలలపాటు బెదిరించాడని పేర్కొన్నారు. అయితే ఈ విషయంపై మరిన్ని వివరాలు చెప్పేందుకు ఆయన నిరాకరించారు. శుక్రవారం మదురైలో లంచం తీసుకొంటుండగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారి ఒకరిని అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేయడంపై మీడియా అడిగిన ప్రశ్నకు స్పీకర్ ఈ మేరకు స్పందించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలు ఏ విధంగా తయారయ్యాయో ఇది సూచిస్తున్నదని ఆయన విమర్శించారు. ప్రతిపక్ష నేతలు, బీజేపీయేతర పార్టీలను లక్ష్యంగా చేసుకొనేందుకు సీబీఐ, ఈడీ, ఐటీ వంటి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరుకు ఇది సాక్ష్యమని అన్నారు.

## ప్యూన్ ఉద్యోగానికి జార్ఖండ్ మంత్రి కొడుకు ఎంపిక

రాంచీ : జార్ఖండ్ కార్మిక శాఖ మంత్రి, ఆర్జేడీ నేత సత్యానంద్ భోక్తా కుమారుడు ముకేశ్ కుమార్ భోక్తా ఛాత్రా జిల్లా కోర్టులో ప్యూన్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కొన్ని నెలల క్రితం ప్యూన్, దఫ్తరీ, ట్రెజరీ మెసెంజర్ వంటి ఉద్యోగాలకు ఈ కోర్టు అడ్మినిస్ట్రేషన్ దరఖాస్తులను ఆహ్వానించింది. నవంబరు 30న జిల్లా ఎంపిక సంఘం తుది ఫలితాలను వెల్లడించింది. ప్యూన్ ఉద్యోగానికి 13 మంది ఎంపికయ్యారు. వీరిలో ముకేశ్ ఒకరు. ఎస్టీ కేటగిరీలో ఆయన ఎంపికయ్యారు.

## ఆప్ ఎంపీ సంజయ్ సింగ్‌పై ఈడీ చార్జిషీట్

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ సంజయ్ సింగ్‌పై ఢిల్లీ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో సంజయ్ సింగ్‌ను ఈడీ ఈ ఏడాది అక్టోబర్‌లో అరెస్టు చేసింది. మద్యం పాలసీ కేసులో నిందితుడిగా ఉన్న వ్యాపారవేత్త దినేశ్ అరోరా రెండు విడతలుగా సంజయ్ సింగ్‌కు ఆయన నివాసంలో రూ.2 కోట్లు ఇచ్చారనేది ఈడీ ఆరోపణ. అయితే ఈ ఆరోపణలు ఎంపీ సంజయ్ సింగ్ కొట్టిపారేశారు.

## 'చర్చకు సిద్ధం.. ప్రతిపక్షాలు సహకరించాలి'

న్యూఢిల్లీ : పార్లమెంటు శీతాకాల సమావేశాల ఎజెండాపై చర్చించేందుకు రాజకీయ పార్టీల నేతలతో కేంద్ర ప్రభుత్వం శనివారం సమావేశమైంది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ఈ సమావేశం వివరాలను మీడియాకు తెలిపారు. పార్లమెంటులో అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే అందుకు తగిన వాతావరణాన్ని ప్రతిపక్షాలు కల్పించాలని నేతలకు చెప్పినట్లు తెలిపారు. నిర్మాణాత్మక చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతిపక్షాల సలహాలను ప్రభుత్వం సకారాత్మకంగా స్వీకరించినట్లు తెలిపారు. 19 బిల్లులు, రెండు ఆర్థిక అంశాలు పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. రాజ్యసభలో ప్రతిపక్ష ఉప నేత ప్రమోద్ తివారీ మాట్లాడుతూ, మన భూభాగాన్ని చైనా ఆక్రమించుకోవడం, మణిపూర్ హింసాత్మక సంఘటనలు, ధరల పెరుగుదల, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం వంటి అంశాలపై ఆందోళన వ్యక్తం చేశామన్నారు. డబ్బు తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు అడిగిన వ్యవహారంలో టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రాపై లోక్‌సభ ఎథిక్స్ కమిటీ నివేదికను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు.

## షిర్డీ సాయి భక్తుల కోసం డాలర్స్..నాణేలు

అహ్మద్‌నగర్ : భక్తుల నుంచి విరాళాల రూపంలో అందిన 155 కేజీల బంగారం, 6 వేల కేజీల వెండిని కరిగించి భక్తుల కోసం మెడలో వేసుకొనే డాలర్స్(మెడల్స్), నాణేలు తయారు చేసేందుకు మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సిద్ధమైంది. ప్రభుత్వ అనుమతి కోరింది. భక్తులు ఇప్పటి వరకు సాయిబాబా ఆలయానికి విరాళాల రూపంలో 450 కేజీల బంగారం, 6 వేల కేజీల వెండి అందించారు. ప్రస్తుతం ఇదంతా ట్రస్ట్ ఖజానాలో ఉన్నది.

## గాజాపై మళ్లీ బాంబుల మోత

### 178 మంది మరణించారన్న ఆరోగ్య శాఖ

గాజా సిటీ : హమాస్ మిలిటెంట్లతో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన వెంటనే ఇజ్రాయెల్ సైన్యం గాజాపై మరోసారి బాంబులతో విరుచుకుపడింది. ఇండ్లు, నివాస భవనాలపై బాంబుల వర్షం కురిపించింది. శుక్రవారంతో ఒప్పందం ముగిసిన గంటలోపే గాజా వ్యాప్తంగా ఇజ్రాయెల్ దాడుల్లో 178 మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ వెల్లడించింది. 200కు పైగా హమాస్ లక్ష్యాలపై తాము దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ పేర్కొన్నది. హమాస్ మిలిటెంట్లు కూడా ఇజ్రాయెల్ భూభాగంపైకి రాకెట్ల ప్రయోగాన్ని తిరిగి ప్రారంభించారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని మధ్యవర్తిగా ఉన్న ఖతార్ వెల్లడించింది.

## హైడ్రో పవర్ ప్రాజెక్టులో అవినీతిపై సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ : జమ్ముకశ్మీర్‌లో ఓ హైడ్రో పవర్ ప్రాజెక్టుకు సంబంధించిన రూ.2,200 కోట్ల పనుల కోసం లంచాలు చేతులు మారినట్టు వచ్చిన ఆరోపణలపై సీబీఐ సోదాలు జరిపింది. ఢిల్లీ, సిమ్లా, నోయిడా, చండీగఢ్‌లో ఆరు చోట్ల శనివారం సోదాలు చేపట్టింది. తాను గవర్నర్‌గా ఉన్నప్పుడు ఫైల్‌పై సంతకం పెడితే రూ.300 కోట్లు ఇస్తామని కొందరు ఆఫర్ ఇచ్చినట్టు సత్యపాల్ మాలిక్ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు చేపడుతున్నది. ఇందులో భాగంగానే సోదాలు జరిపింది.

## చిన్నారులకు విటమిన్ డి సప్లిమెంట్స్‌తో ప్రయోజనం శూన్యం

న్యూఢిల్లీ : చిన్నారులకు విటమిన్ డి సప్లిమెంట్స్ ఇవ్వడం వల్ల ఎముకలు బలోపేతమవుతాయనే నమ్మకం ఉన్నది. అయితే అది నిజం కాదని తాజాగా లాన్సెట్ జర్నల్‌లో ప్రచురితమైన పరిశోధన నివేదిక వెల్లడించింది. సప్లిమెంట్స్‌తో ఎముకల బలం పెరగదని, ఎముకలు విరగడాన్ని నిరోధించబోవని తెలిపింది. మంగోలియాలో 6–13 ఏళ్ల మధ్య వయసు గల 8,851 మంది బాలలపై ఈ పరిశోధన జరిగింది.

# 'ఉపాధి హామీ'ని ఆడిట్ చెయ్యరా?

- 10 ఏండ్లుగా నిర్వహించని కాగ్
- లోపాలు బయటపడతాయని మోదీ ప్రభుత్వానికి భయం
- అమల్లో అక్రమాలపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు






న్యూఢిల్లీ, డిసెంబర్ 2: గ్రామీణ ప్రాంతాల వారికి ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ) లేదా జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని కేంద్రం అమలు చేస్తున్నది. ప్రతి ఏడాది లక్షలాది మందికి ఉపాధి కల్పించే ఈ పథకానికి గణనీయంగా నిధులు తగ్గించి ఇప్పటికే మోదీ ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొంటున్నది. తాజాగా ఆ పథకాన్ని కనుక కాగ్ ఆడిట్ చేస్తే ఎన్నో లోపాలు బయటపడతాయని కేంద్ర ప్రభుత్వం భయపడుతుందా? అన్న ప్రశ్న తలెత్తింది. 2005లో ప్రవేశపెట్టిన ఈ పథకం వయోజన సభ్యులకు ఆర్థిక సంవత్సరంలో వంద రోజుల వేతన ఉపాధికి చట్టపరమైన హామీని ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసే పనుల ద్వారా ఉపాధి కల్పించి ప్రజల జీవన భద్రతను పెంచడం ఈ పథకం లక్ష్యం. అయితే జాతీయ స్థాయిలో అత్యంత ముఖ్యమైన ఈ పథకం అమలు తీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) 2013 నుంచి ఎలాంటి ఆడిట్ నిర్వహించ లేదు. కాగ్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఈ పథకానికి చివరిసారిగా 2013లో ఆడిట్ నిర్వహించారు. ఈ పథకాన్ని 2016లో జాతీయ స్థాయిలో కాగ్ ఆడిట్‌కు తీసుకుంది. కానీ ఆడిట్ చేయకుండా కేవలం సామాజిక ఆడిట్ యూనిట్లను పరిశీలించడానికి మాత్రమే పరిమితమైంది. 2013లో కాగ్ ఇచ్చిన నివేదిక సమగ్రంగా ఉంది. ఈ పథకానికి సామాజిక ప్రభావాన్ని కవర్ చేసే ప్రణాళిక ఉందని 2016 నివేదికలో పేర్కొన్నది. ఆ తర్వాత ఈ పథకంపై కాగ్ నివేదిక ఊసే లేకుండాపోయింది.

**కేంద్రం అదుపులో కాగ్!**

కాగ్ అనేది స్వయం ప్రతిపత్తి గల అత్యున్నత ఆడిట్ సంస్థ. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల వ్యయాలను ఆడిట్ చేసే హక్కు దానికి ఉంది. దీని నివేదికలను పార్లమెంట్/శాసనసభల ముందు ఉంచుతారు. అయితే పేరుకి స్వయం ప్రతిపత్తి సంస్థ అయినా దీన్ని కేంద్రం అదుపులో పెట్టుకుంటుందన్న విమర్శలున్నాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివేదికలు ఇచ్చి ముగ్గురు కాగ్ అధికారులను మోదీ ప్రభుత్వం ఇటీవల బదిలీ చేయడం మనకు తెలిసిందే. మోదీ హయాంలో చేపట్టిన ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల్లో వందలాది కోట్ల అక్రమాలు జరిగాయంటూ కాగ్ తన నివేదికలో పేర్కొంది. ఉపాధి హామీ పథకానికి మోదీ ప్రభుత్వం గణనీయంగా నిధుల కేటాయింపును తగ్గించింది. 2023 బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.60 వేల కోట్లను మాత్రమే కేటాయించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 33 శాతం తగ్గుదల. పైగా ఈ పథకం గురించి ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకున్న వివాదాలు చోటుచేసుకున్నాయి. ఈ పథకం కింద కూలీలకు చెల్లింపులలో డిజిటల్ విధానం తీసుకురావడమే కాక, పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపణలు వచ్చాయి. అందువల్లే రెగ్యులర్‌గా ఈ పథకానికి కాగ్ ఆడిట్ నిర్వహించడం లేదని విమర్శలు వస్తున్నాయి.



## ఆదిత్య గుప్పిట సౌరగాలులు

బెంగళూరు, డిసెంబర్ 2: సూర్యుడిపై అధ్యయనం కోసం ఇస్రో పంపిన 'ఆదిత్య ఎల్–1' ఉపగ్రహం విజయం దిశగా దూసుకెళ్తున్నది. ఈ ఉపగ్రహంలో కీలకమైన పేలోడ్ సోలార్ విండ్ పార్టికిల్ ఎక్స్‌పిరిమెంట్ తన పనిని ప్రారంభించింది. ఇందులోని రెండు పరికరాలు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ముఖ్యంగా సూర్యుడి నుంచి వచ్చే సౌర గాలులను ఈ పరికరాలు రికార్డు చేశాయి. భూమిపై సౌరగాలుల ప్రభావాన్ని అధ్యయనం చేయడానికి ఈ సమాచారం ఎంతగానో ఉపయోగపడనున్నది.

## గగన్‌యాన్‌కు వ్యోమగాముల ఎంపిక పూర్తి



గాంధీనగర్, డిసెంబర్ 2: భారత్ తొలిసారిగా మానవులను అంతరిక్షంలోకి పంపే గగన్‌యాన్ యాత్రకు వ్యోమగాముల ఎంపిక పూర్తయ్యిందని, 2025లో చేపట్టే అంతరిక్ష యాత్ర కోసం తామంతా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నామని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ శనివారం ప్రకటించారు. పండిత్ దీన్‌దయాళ్ ఎనర్జీ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో ఆయన మాట్లాడుతూ నలుగురు వ్యోమగాములను అంతరిక్షంలోకి మూడు రోజుల పాటు పంపి, సురక్షితంగా వారిని భూమిపైకి తేవడమే ఈ మిషన్ లక్ష్యమని చెప్పారు. ఆగస్టులో చంద్రయాన్–3 విజయవంతం తర్వాత తదుపరి మిషన్ అయిన గగన్‌యాన్ కోసం సిబ్బంది రేయింబవళ్లు చేసిన కృషితో ఈ మిషన్ సిద్ధమైందని చెప్పారు. ఈ మిషన్‌లో వ్యోమగాములను తిరిగి సురక్షితంగా భూమిపై ల్యాండయ్యేలా చేయడం చాలా ముఖ్యమని అన్నారు. అంతరిక్ష మిషన్‌లకు సంబంధించి పలు సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేశామని, పలు టెక్నాలజీల మేలు కలయికతోనే ఇలాంటి క్లిష్టతర మిషన్‌లను విజయవంతం చేయగలిగామన్నారు.

## రూ.5 వేల కరెంట్ బిల్లుకు రూ.197 కోట్ల రసీదు!

గోరఖ్‌పూర్ : విద్యుత్తు బిల్లు మొత్తం స్వీకరణ సందర్భంగా చోటు చేసుకొన్న చిన్న తప్పిదం.. మొత్తం విద్యుత్తు శాఖ అధికారులను కలవరానికి గురిచేసింది. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన చౌహరీ దేవి అనే మహిళకు రూ.4,950 కరెంట్ బిల్లు వచ్చింది. అయితే దీన్ని చౌహరీ దేవి కుమారుడు సంబంధిత చెల్లింపు కేంద్రానికి వెళ్లి కట్టగా.. అక్కడ పొరపాటున రూ.197 కోట్లు చెల్లించినట్టు రసీదు ఇచ్చారు. ఆ తర్వాత కరెంట్ బిల్లుల మొత్తానికి, వసూలైన సొమ్ముకు పొంతన కుదరక అధికారులు గందరగోళానికి గురయ్యారు. కంప్యూటర్ ఆపరేటర్ కరెంట్ బిల్లు మొత్తం రూ.4,950కు బదులుగా బిల్లు కాగితంలోని 197..తో మొదలైన కనెక్షన్ నంబర్‌ను నమోదు చేయడంతో తప్పిదం దొర్లినట్టు గుర్తించారు.

# తుఫానుగా మారనున్న అల్ప పీడనం

### 4న ఏపీలో తీరం దాటే అవకాశం

### దక్షిణ మధ్య రైల్వే పరిధిలో పలు రైళ్ల రద్దు



చెన్నైలోని కాసిమేడు ఫిషింగ్ హార్బర్‌లో లంగరేసిన పడవలు

భువనేశ్వర్, డిసెంబర్ 2: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం శనివారం మరింత తీవ్రమైంది. ఇది తుఫానుగా మారి ఆంధ్ర ప్రదేశ్ కోస్తాలోని నెల్లూరు–మచిలీపట్నం మధ్య సోమవారం తీరం దాటే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దీని ప్రభావం వల్ల ఏపీ, ఒడిశా రాష్ట్రాల్లో ఆది, సోమ, మంగళ వారాల్లో భారీ వర్షాలు పడవచ్చని తెలిపింది. తుఫాను తీరం దాటే సమయంలో 80–90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. అల్పపీడనం తుఫానుగా మారితే దానిని 'మిచాంగ్'గా వ్యవహరించాలని మయన్మార్ సూచించినట్టు ఐఎండీ అధికారులు తెలిపారు. ముందు జాగ్రత్త చర్యగా అక్కడ ఆరెంజ్ హెచ్చరిక జారీ చేసినట్టు చెప్పారు. ఒడిశాలోని ఎనిమిది కోస్తా జిల్లాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. తుఫాను నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 140 రైళ్లను రద్దు చేస్తున్నట్టు రైల్వే సీపీఆర్‌వో తెలిపారు. డిసెంబర్ 3 నుంచి 6 వరకు పలు రైళ్లను రద్దు చేస్తున్నామన్నారు. ఇందులో చాలా రైళ్లు పూర్తిగా, కొన్ని పాక్షికంగా రద్దు చేస్తున్నామని తెలిపారు.

## కోల్‌కతాలో స్పేస్ సైన్స్ మ్యూజియం ప్రారంభం

కోల్‌కతా : అంతరిక్షం గురించి తెలుసుకోవాలనే ఉత్సాహం ఉన్నవారికి శుభవార్త! కోల్‌కతాలోని నేతాజీ నగర్‌లో ఉన్న 'ది మ్యూజియం ఆఫ్ ఆస్ట్రానమీ అండ్ స్పేస్ సైన్స్'ను సందర్శించేందుకు ప్రజలకు అవకాశం కల్పించారు. వ్యోమగామి నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ తల వెంట్రుకలు, చంద్రుడు, అంగారక శిలలు, 370 కోట్ల సంవత్సరాల క్రితంనాటి బ్యాక్టీరియా శిలాజం వంటివి ఈ మ్యూజియంలో ఉన్నాయి. దీనిని వ్యోమగామి రాకేశ్ శర్మ అక్టోబరులో ప్రారంభించారు. ఇండియన్ సెంటర్ ఫర్ స్పేస్ ఫిజిక్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ కుమార్ చక్రవర్తి మాట్లాడుతూ, శని, ఆదివారాలతోపాటు సెలవు దినాల్లో ఈ మ్యూజియాన్ని సందర్శించవచ్చునని తెలిపారు. పాఠశాలలు 100 టికెట్లను కొంటే, ఒక్కొక్క టికెట్‌పై రూ.20 చొప్పున తగ్గిస్తారు. ఆన్‌లైన్‌లో కూడా కొనవచ్చు.